క్లుప్తంగా

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యాన్ని చూపుతున్న సెబ్ సీఐ విన్నీలత

ఆదోని రూరల్: స్థానిక బోయగేరికి చెందిన ఆరుగురు మంగళవారం మండలంలోని కడితోట వద్ద కర్ణాటక మద్యాన్ని పోలీసులకు పట్టుబడ్డారు. సెబ్ సీఐ విన్నీలత తెలిపిన వివరాలు.. బోయగేరికి చెందిన బోయ హనుమంతమ్మ, బోయ మానస, బోయ రాధమ్మ, బోయ ఈరమ్మ, బోయ వీరేశమ్మ, బోయ సింధును అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 21 బాక్సుల కర్ణాటక మద్యం (2016 టెట్రా ప్యాట్లు)ను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.84 వేలు ఉంటుందని, నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నామని సీఐ తెలిపారు.

సప్లిమెంటరీ పరీక్షల ఫీజు చెల్లించాలి

ఆదోని సెంట్రల్: పదో తరగతి ఫెల్ అయిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలు రాయడానికి ఈనెల 30లోపు ఫీజు చెల్లించాలని డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి మంగళవారం తెలిపారు. ఆయా పాఠశాలల్లో హెచ్ఎంలు విద్యార్థుల నుంచి ఫీజు కట్టించుకోవాలన్నారు. మే 1 నుంచి 23వ తేదీ వరకు రూ.50 అపరాధ రుసుముతో ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రీ కౌంటింగ్ ఒక్కో సబ్జెక్టుకు రూ.500, రీ వెరిఫికేషన్‌కు ఒక్కో సబ్జెక్టుకు రూ.1,000 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. సప్లిమెంటరీ పరీక్షలు మే 24 నుంచి జూన్ 3వ తేదీ వరకు ఉంటాయన్నారు. కాగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు బుధవారం నుంచి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు.

ఇంటింటా ప్రచారం



కరత్రాలు అందజేస్తున్న నాయకులు

కోసిగి: మంత్రాలయం ఎమ్మెల్యేగా వై.బాలనాగిరెడ్డిని మరోసారి గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు బండ్ల గోవిందు, నర్సారెడ్డి, కక్రయ్య కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని దుర్నిగేని, ఆంజనేయ స్వామి, పెద్దమ్మవ్వ కాలనీలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఐదేళ్లలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల కరపత్రాను పంచుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. కార్యక్రమంలో కార్యకర్తలు, అభిమానులు వీరారెడ్డి, వెంకటరెడ్డి, హనుమంతు, కోసిగయ్య, ఫాతప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వెంటే ఉంటాం



బాలనాగిరెడ్డితో పీఎస్ సుందరరాజుదొర

కోసిగి: తమ కుటుంబం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వెంటే ఉంటుందని మండల కేంద్రానికి చెందిన దొరల వంశస్తుడు సుందరరాజుదొర తెలిపారు. మంగళవారం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని కలిసి మద్దతు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో కనుమరుగైందన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమన్నారు. వైఎస్సార్‌సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామన్నారు.

రూ.లక్ష విరాళం



దాతలకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి ఆలయంలో చేపడుతున్న రాజగోపుర నిర్మాణానికి మంగళవారం భక్తులు విరాళం అందజేశాన్నారు. తెలంగాణ రాష్ట్రం అచ్చంపేటకు చెందిన శ్రీకాంత్, అనూష కుటుంబ సభ్యులు రూ.లక్ష నగదును ఆలయ కార్యాలయంలో అందజేశారు. దాత కుటుంబానికి ఆలయ అధికారులు సంప్రదాయం ప్రకారం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయించి, స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డూ, ఫొటో, విరాళ బాండు అందజేశారు.

నగదు స్వాధీనం

ఆలూరు రూరల్: ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకువెళ్తున్న రూ.1,20,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఓబులేషు బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి స్థానిక గుంతకల్లు జంక్షన్ వద్ద ఆదోనికి చెందిన ఓ వ్యక్తిని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా అతని వద్ద రూ.1.20 లక్షల నగదు ఉన్నట్లు గుర్తించారు. నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు చెప్పారు.



రథాన్ని లాగుతున్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న కోట భద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామి

రమణీయం.. రథోత్సవం

ఆదోని అర్బన్: పట్టణ శివారులోని కోట నగర్‌లో వెలిసిన కోట భద్రకాళి సమేత వీరభద్రస్వామి రథోత్సవం మంగళవారం కడు రమణీయంగా సాగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు దేవిశెట్టి మంజునాథ్ ఆధ్వర్యంలో స్వామివార్లకు వేకువజామున రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి, నైవేద్యంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేపట్టారు. సాయంత్రం డోలు, సన్నాయిల మధ్య ఆలయ ప్రాంగణంలో భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఉత్సవమూర్తులతో రథోత్సవం జరిగింది. ఓం నమఃశివాయ నామస్మరణతో భక్తులు రథాన్ని లాగారు. కార్యక్రమంలో పూజారులు హీరేమఠం మంజునాథ్, మంజు పాల్గొన్నారు.

వైభవం.. జ్యోతి మహోత్సవం



పూజలందుకుంటున్న చౌడేశ్వరిదేవి



జ్యోతి మహోత్సవంలో భక్తులు

కౌతాళం: మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఉదయం తుంగభద్ర నది జలాలు తీసుకువచ్చి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయం వరకు మహిళలు కలశాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయం నుంచి జ్యోతిని మంగళవాయిద్యాలు, భజనలతో జ్యోతులను అమ్మవారి ఆలయానికి తీసుకువచ్చారు. నదీజలాలతో అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేపట్టారు. జ్యోతుల ఉత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

మూడు దుకాణాల్లో చోరీ



దుకాణం వెనుక రేకు తొలగించిన దృశ్యం

ఎమ్మిగనూరురూరల్: స్థానిక 167 జాతీయ రహదారి అగ్నిమాపక కేంద్రం సమీపంలోని మూడు కూల్‌డ్రింక్ దుకాణాల్లో దొంగతనం జరిగింది. రోజు మాదిరిగానే దుకాణ యజమానులు సోమవారం రాత్రి షాపులకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా బావించిన దొంగలు దుకాణాల వెనక వైపు రేకులను తొలగించి లోపలికి ప్రవేశించి సిగరెట్లు, హోటల్ సరుకులు, రూ.20 వేల నగదును దోచుకెళ్లారు. మంగళవారం దుకాణాలకు వచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. యజమానులు హరికృష్ణ, తిమ్మరాజు, భీమలింగకు చెందిన దుకాణాల్లో రూ.35 వేల విలువ చేసే సిగరెట్లు, రూ.20 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పట్టణ పోలీసులు చెప్పారు.

ఓటుహక్కును వినియోగించుకోండి

● ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ



ర్యాలీలో పాల్గొన్న సబ్‌కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, ఇతర అధికారులు

ఆదోనిరూరల్: ఓటు హక్కును వినియోగించుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. మంగళవారం స్థానిక ఆస్పత్రి నుంచి ఎమ్మిగనూరు సర్కిల్ వరకు మున్సిపల్, సెక్టోరల్ అధికారులు, బీఎల్‌వోలు, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బందితో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ఓటు ఉన్న ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఓటువేసే అనుకూలమైన వాతావరణం ప్రతి పోలింగ్ స్టేషన్‌లో కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనాసుల్తానా, మున్సిపల్ కమిషనర్ రామచ్రందారెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, డీఎల్‌పీఓ పరిపాలనాధికారి వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

చీని తోట దగ్ధం



మంటల్లో కాలిపోయిన చీని తోట

గోనెగండ్ల: మండల పరిధిలోని బైలుప్పల గ్రామ శివారులో చీని తోటకు మంగళవారం మధ్యాహ్నం నిప్పంటుకుని 30 మొక్కలు కాలిపోయాయి. గ్రామానికి చెందిన మాధవ రెడ్డికి చెందిన బైలుప్పల - బి.అగ్రహారం గ్రామాల మధ్య ఉన్న 2.50 ఎకరాల పొలంలో చీని తోటను సాగుచేశాడు. మధ్యాహ్నం అటుగా వెళ్లిన గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి ఆర్పకుండా పడేయడంతో మంటలు చెలరేగి తోటకు వ్యాపించి 30 చెట్లు కాలిపోయాయి. సెగకు మరికొన్ని మొక్కలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను అదుపుచేశారు. బాధిత రైతు మాట్లాడుతూ దాదాపు రూ.4 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

28న 'మంచం మీద పెళ్లి' నాటక ప్రదర్శన

కర్నూలు కల్చరల్: స్థానిక టీజీవీ కళాక్షేత్రంలో ఈనెల 28వ తేదీ సాయంత్రం 6 గంటలకు సాంఘిక నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు కార్యక్రమ కన్వీనర్లు సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న తెలిపారు. చిలకలూరి పేట మద్దుకూరి క్రియేషన్స్ వారిచే నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6.30 గంటలకు ప్రముఖ నాటక రచయిత కాళ్లకూరి నారాయణ రావు జయంతి సందర్భంగా 'చింతామణి - భవాని ' సీను ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు.



అధిక మార్కులు సాధించిన విద్యార్థినులతో డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

విద్యార్థులకు అభినందన

ఆదోని సెంట్రల్: పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులను పాఠశాల హెచ్ఎం/డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి మంగళవారం అభినందించారు. కే.సౌమ్య 575, పి.కుషుబు 566, కే.లావణ్య 558, ఎం.సౌమ్య 553, కే.తేజశ్వి 542, సి.తేజశ్విని 541, కే.అక్షయ్‌శ్రీ 540 మార్కులను సాధించారని ఆయన తెలిపారు. డివిజన్ వ్యాప్తంగా 1,6164 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 9,210 మంది పాసు కావడంతో 56.98 శాతం ఉత్తీర్ణ నమోదైందన్నారు. అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, ఉపాధ్యాయులను కూడా ఆయన అభినందనలు తెలిపారు.

కౌతాళం: పది, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. మంగళవారం స్థానిక బసవన్నగుడి వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇంటర్ బైపీసీలో 813 మార్కులు సాధించిన రాధిక, పదో తరగతిలో 436 మార్కులు సాధించిన జ్యోతిలను వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ప్రహ్లాద చారి, సర్పంచ్ పాల్‌దినకర్, ఉప సర్పంచ్ తిక్కయ్య, మాజీ సర్పంచ్ అవతారం తదితరులు సన్మానించారు.

వలంటీర్ల రాజీనామా



రాజీనామా పత్రాలను ఎంపీడీఓ జనార్దన్‌కు అందజేస్తున్న హెచ్.మురవణి వలంటీర్లు



కౌతాళం ఎంపీడీఓకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

ఆదోని టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 8 మంది వలంటీర్లు మంగళవారం రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను వార్డు అడ్మిన్లకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో వలంటీర్లు రాధిక, శాంతి, ఉమాదేవి, అనూష, అరుణ, పద్మేశ్వరి, జ్యోతి, హర్షిక ఉన్నారు.

➡ కౌతాళం: మండలంలోని వల్లూరు పంచాయతీలో నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ రఘునాథ్‌గుప్తాకు అందజేశారు.

➡ పెద్దకడుబూరు: మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామ వలంటీర్లు మంగళవారం ఎంపీడీఓ జనార్దన్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. టీడీపీ నాయకులు తమపై చేస్తున్న అసత్య ప్రచారానికి మనస్తాపం చెంది రాజీనామా చేస్తున్నట్లు వలంటీర్లు చిలుక రామంజి, గోసి వెంకటేశులు, రామలింగుడు, మహబూబ్‌బాషా, రాళ్ల రఘు, ఎం.భాస్కర్, దొడ్డి నాగరాజు, బిల్లేకల్లు లక్ష్మి, ముల్ల ఆశమ్మ, విజయలక్ష్మి, రాళ్ల శారద తెలిపారు.

ఐదు నామినేషన్ల దాఖలు



రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో ఆదోని నియోజకవర్గానికి మంగళవారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలయ్యాయి. ఐదుగురు తమన నామినేషన్లను దాఖలు చేశారు. వైఎస్సార్‌సీపీ తరఫున వై.సాయిప్రసాద్‌రెడ్డి రెండో సెట్ దాఖలు చేశారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా రమేష్‌యాదవ్, స్వతంత్ర్య అభ్యర్థులు వడ్డే ఉరుకుందు, కె.రంగన్న, కె.భాగ్యలక్ష్మి తమ నామినేషన్ పత్రాలను సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మకు అందజేశారు. మరో రెండు రోజుల్లో నామినేషన్ల గడువు ముగియనుంది. నామినేషన్లు వేసేందుకు ఔత్సాహికులు పోటీ పడుతున్నారు. దీంతో నామినేషన్ వేసే వారి సంఖ్య పెరగనుంది.

ఘనంగా హనుమాన్ జయంతి



రణమండల ఆంజనేయస్వామికి గంధాభిషేకం చేస్తున్న దృశ్యం



దర్శించుకుంటున్న భక్తులు



ప్రత్యేకాలంకరణలో ఆంజనేయస్వామి

ఆదోని అర్బన్: పట్టణంలో హనుమాన్ జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. వైష్ణవ, శైవ, అమ్మవారు, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. రణమండల కొండపై వెలిసిన ఆంజనేయస్వామి వారికి కార్తీక మాస నిత్య ప్రసాదసేవా సమితి ఆధ్వర్యంలో గంధాభిషేకం, పసుపు, కుంకుమ, అభిషేకం, ఫల పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం, సింధూరసేవ, తులసీ, వడలహారం, నైవేద్యం, మహామంగళహారతితో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

రేణుకా యల్లమ్మవ్వ ఆలయంలో వేడుకలు

యల్లమ్మకొండపై వెలిసిన రేణుకా యల్లమ్మవ్వకు పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణ, మహామంగళహారతితో పూజలు చేశారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి పిండివంటలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కేడీసీసీబీ సీఈఓ శివలీల సస్పెన్షన్

కర్నూలు(అగ్రికల్చర్): ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈఓ శివలీలను సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఉత్తర్వులు జారీ చేశారు. కేడీసీసీ బ్యాంకులో జనరల్ మేనేజరైన శివలీల సీఈవోగా ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఎన్నికల కోడ్ అమలులోకి రాకముందు 40 రోజుల పాటు సెలవుల్లో వెళ్లిన ఆమె ఇటీవల తిరిగి వచ్చారు. కోడ్ అమలులో ఉన్న సమయంలో జిల్లా ఎన్నికల అధికారి అనుమతి లేకుండా ఇన్‌చార్జ్ బాధ్యతలు స్వీకరించారు. ఈ విషయం జిల్లా ఎన్నికల యంత్రాంగం దృష్టికి పోవడంతో షోకాజ్ నోటీసు ఇచ్చి 24 గంటల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించారు. సమాధానం ఇచ్చినప్పటికీ సంతృప్తికరంగా లేకపోవడంతో చర్యలకు ఆదేశాలు ఇచ్చారు. దీంతో శివలీలను ఇన్‌చార్జ్ సీఈవో బాధ్యతల నుంచి తప్పించి ఆప్కాబ్ డీజీఎం విజయకుమార్‌కు ఆ బాధ్యతలు అప్పగిస్తూ డీసీసీబీ పాలకవర్గం ఛైర్మన్ విజయమనోహరి చర్యలు తీసుకున్నారు.

28 న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 28 వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో అండర్-15, అండర్- 19, సీనియర్స్ బాలికల క్రికెట్ జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేంద్ర గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిని క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనాలన్నారు. అండర్-15 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2009 సంవత్సరం సెప్టెంబర్ నెల 1 వ తేదీ నుంచి 2011 సంవత్సరం ఆగస్టు 31 వ తేదీ మధ్యన జన్మించి ఉండాలని ఆయన తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

తాగునీటికి ఇబ్బందులు లేవు

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులేమి లేవని, ఇందుకోసం ముందస్తుగా అన్ని రకాల చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ జి.సృజన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి వివరించారు. మంగళవారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తాగునీరు, ఉపాధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె జిల్లాలోని పరిస్థితులను సీఎస్‌కు వివరించారు. మరో రెండు నెలలపాటు తాగునీటి ఇబ్బందులను ఎదుర్కోవడానికి ప్రణాళికలు వేసుకున్నట్లు చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ కల్లా కల్యాణి, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి పాల్గొన్నారు.

రామలింగేశ్వరా.. హరోం..హరహర



భక్తుల మధ్య సాగుతున్న స్వామి వారి మహా రథోత్సవం

● భక్తిశ్రద్ధలతో సాగిన రథోత్సవం



రథోత్సవానికి హాజరైన వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు గ్రామ ప్రజల ఆరాధ్య దైవం, తుంగభద్ర నది ఒడ్డున వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి మహా రథోత్సవం వేలాది మంది భక్తుల మధ్య మంగళవారం రమణీయంగా సాగింది. అంపయ్య పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయ కమిటీ అధ్యక్షులు శరణప్పగౌడ, బెట్టన గౌడల ఆధ్వర్యంలో వేకువ జాము నుంచి తుంభభద్ర నది జలాలతో అభిషేకాలు చేసి, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచన అలంకరణ, మహా మంగళ హారతులతో ప్రత్యేక పూజలు చేపట్టారు. సాయంత్రం ఆలయం నుంచి పల్లకీలో స్వామి వారి ఉత్సవమూర్తిని కలశాలు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల మధ్య ఊరేగింపుగా రథం వద్దకు చేరుకున్నారు. ఉత్సవ మూర్తిని మహా రథంపై కొలువుంచి వేలాది మంది భక్తుల హర్షధ్వానాల మధ్య పాదాల చెంత వరకు లాగారు. అనంతరం తిరిగి యథాస్థానానికి చేర్చారు. భక్తులు రథంపై అరటి పండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవంలో హాల్వి మఠం పీఠాధిపతి అభినవ మహంతేష్ స్వామి, కర్ణాటక రాష్ట్రం నీలగల్ పీఠాధిపతి పంచాక్షర శివచార్య, సోమవార పేట హరే మఠ పీఠాధిపతి రాయచోటి వీర శివచార్యులు హాజరయ్యారు. స్వామివారిని వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి దర్శించుకుని రథోత్సవంలో పాల్గొన్నారు.